అద్దెకొంపలు

భమిడిపాటి కామేశ్వరరావు గారు

ఒకరి తాలూకుకొంప, మరియొకరు, ఆ ఒకరికి అసహ్యంవేసిన తక్షణం ఖాళీచేయగల పద్ధతిని, తాత్కాలికంగా, అసలుకిమోసం రాకుండా వాడుకుంటూ, అట్లా కొంప వాడుకుంటూన్నందుకుగాను పరతుప్రకారం ఆ ఒకరికి (అనగా కొంపయజమానికి) నెలనెలా రొఖ్ఖరూపేణా "ఇంత" అని దాఖలు చెయ్యవలసిన ప్రతిఫలం ఉందే, దాన్నే, "అద్దె" అంటారు. దీన్నే కొందరు (తెలుగువాళ్లే) "బాడుగ" అంటారు. అననీండి. "అద్దె" అనడం కంటె "బాడుగ" పొడుగా లేదు. అట్టి సందర్భంలో, ఆ కొంపకి "అద్దెకొంప" అనీ, ఇచ్చిన వాడికి "అద్దెయజమాని" లేక "ఇంటి ఆయన" అనీ, పుచ్చుకున్న వాడికి "అద్దెకున్నాయన" లేక "అద్దెకొచ్చినాయన" లేక "కాపరం ఉన్నవారు" అనీ చెప్పుగుంటారు. ఆస్తియొక్క దాన విక్రయాలు అద్దెతో పోల్చిచూడగా—దానంలో, దాత ప్రతిఫలం కోరడు (కొందరు కీర్తికోరి తీరతారు), ప్రతిగృహీత ఎల్లకాలమూ వాడుకుంటాడు. విక్రయంలో, అమ్మేవాడు ప్రతిఫలం తింటాడు, కొనేవాడు ఎల్ల కాలమూ అనుభవిస్తాడు (పేచీలులేకుండా ఉంటే!); కాని, అద్దె విషయంలో, యజమాని ప్రతిఫలం లాగుతూంటాడు, అద్దెకున్నవాడు తాత్కాలికంగా ఉంటూంటాడు. హక్కువారిదీ, భుక్తంవీరిది!

హుటాణకంతో బయలుదేరిన ఉద్యోగాలల్లో సర్దుకుంటొచ్చిన వారికి కారణాంతరాలవల్ల బదలాయింపులు మామూలై గ్రామాంతరవాసం తప్పనిసరి అవుతొచ్చినప్పణ్ణించీ "అద్దెకొంపలు" అనేటటువంటివి జనించి ఉంటాయి. ఇట్టివి బస్తీలలో విరివిగానూ, పల్లెలలో సకృత్తుగానూ వెలవడం సహజం. ఏదేనా ఊరికి ఓ కొత్తకోర్టుగాని, అడిషనల్ కోర్టుగాని, పాత తీర్థంగాని, పుష్కరంగాని, మరి ఏదో ఒక ముఖ్యసంస్థగాని వచ్చే కాలమే అద్దెకొంపలకి చిత్త. అటువంటప్పుడు, అదివరదాకా ఒకరికి చాలీచాలకుండా ఉంటూన్న ఇల్లు, వారికే తెగఎక్కువైపోయి ఊరుకుంటుంది. ఆమట్టున, వారు, అ ఉన్నదాల్లోనే కొంత అద్దె భాగంకింద కేటాయిస్తారు (తమ మేలుకోరేవాళ్లు నూకలేసినమీదట). కాబట్టి, కొన్నికొన్ని పుట్టుకచేతనే అద్దెకొంపలుగా కూర్చినవి; కొన్నికొన్ని పెంపకంచేత అద్దెకొంపల లిస్టులో చేర్చినవి; కొన్నికొన్ని బలిమిచేత అద్దెకొంపలుగా మార్చినవి. ఆంగ్లవిద్య నేర్చిన వాళ్లల్లోచాలామందిది జన్మస్థానం పల్లెటూరైనా, ఉద్యోగస్థానం బస్తీయే అవుతూంటుంది. వార్ని, ప్రయాణాల్లో, ఎవరేనా, "తమదేవూరు?" అని ప్రశ్నిస్తే, పైరెండింటల్లోనూ ఎందుకో అందుకు ఎక్కువ ప్రసిద్ధి కెక్కిన ఊరుంటుందే అదే తమదని చెప్పేసి దాటుకు పోతూంటారు. ఏమయితేంగాక ఒక ఊళ్లో కొంపపాడు. దాన్ని చూస్తే వారికి మంట. గృహాభిమానం అట్లా చచ్చినప్పుడు, గ్రామాభిమానం కూడా ఎట్లా చస్తుందో చెప్పచ్చు. కాని, తద్వారా దేశాభిమానం కూడా చావకుండా ఎట్లా ఉంటుందో ఋజువు చెయ్యమంటే మాత్రం కష్టం. అల్లాంటివాళ్లు బస్తీలో అద్దెకొంపకి మేతవేసి, పల్లెటూరిలో స్వంత కొంపకి కడుపు మాడుస్తూంటారు. ఆ పల్లె కొంపలో ఎవరేనా కుదురుకుని తమరికి అద్దె ముట్టచెప్పాలని కాదు వారు అహోరించేది! ఎవరేనా ఉండి దీపం పెట్టుగుంటే చాలని! అదీకాదు! కొందరు, అ దీపంనిమిత్తం స్వంత ఖర్చుమీద కోతిమార్కు కిరసనాయిలు డబ్బాకూడా (ఉండగలవారికి) సప్లయిచేసే వాళ్లుకూడా ఉంటొచ్చారు. కాని, అనేకడిపార్టుమెంటుల ఉద్యోగాలు ఇప్పుడు పల్లెటి దిక్కునకూడా ఆవిర్భవించడం వల్ల పైస్థితి కొంచెం తిరగబడి అక్కడ సమేతూ అద్దెలు వస్తూనే ఉన్నాయి, ఇటీవల. అదీగాక, పొలాలవల్ల రాబడి అనేది విస్తారం ఎండకి ఎండి వానకి తడిసి మాసిగలు పడ్డమీదట సాలుకి ఓసారి (మహాఅయితే రెండుసార్లు) వస్తేరావచ్చు

అనే బాపతుది అవడంచేతనున్నూ, అద్దె అనేది సునాయాసంగా, నెలనెలా, నమ్మకంగా వచ్చేది అవడం చేతనున్నూ, అద్దెమీద జనానికి మోహం ఎక్కువై, "పల్లెటూళ్లో పాతిక ఎకరాలు ఉండే కంటే బస్తీలో నాళ్ల నడాన్ని నూంచి మొగలో ఒక్క అద్దె కొంప వుంటే చాలదుషోయ్?" అనే అభిప్రాయం బాగా వేళ్లుబారింది. అక్కణ్ణించి "వీరికి సాలుకి ఓ వంద బస్తా నిరాటంకంగా వస్తుంది" అని పించుకోడం కంటె "వీరికి అద్దెలవల్ల సాలుకి ఓ వంద వస్తుందట!" అని పించు గోడమే పెద్ద మనిషి తరహాకి లక్షణం అయింది.

ఎట్లా అయితేం, అద్దెకి మోజు ఎక్కువై, అన్నింటితో పాటు అది కూడా ఒక "ఫాషన్" అయింది. అనగా, ప్రతీవాడూ, ప్రతీదీ, నెలకి, రోజుకి, క్షణానికి కూడా అద్దెకివ్వడం సాగించాడు. మార్వాడీ డబ్బుగాని నగలుగాని అద్దెకిస్తాడు. చాకలి బట్టలు అద్దెకిస్తాడు. వారస్త్రీ శరీరం అద్దెకిస్తుంది. కార్మికుడు కరచరణాలు అద్దెకిస్తాడు. లాయరు తెలివి తేటలు అద్దెకిస్తాడు. డాక్టరు ఆరోగ్యం అద్దెకిస్తాడు. ఉపాధ్యాయుడు తెలియడం అద్దెకిస్తాడు. గబ్బిలపు ఉద్యోగి మనస్సు అద్దెకిస్తాడు. మంగలి శూన్యత్వం అద్దెకిస్తాడు. వాహనం వేగం అద్దెకిస్తుంది. ఇల్లాగా, సర్వత్రా అద్దె వ్యాపించి ఉంది. కాబట్టి, కొంప అద్దెకివ్వడంలో విడ్డూర్యం బొత్తిగా లేదు. కొందరు గడవక, కొందరు మొహమాటం చొప్పున, కొందరు ఒక్కరూ ఉండలేక, కొందరు దురాలోచనతో, కొందరు దూరాలోచనతో, కొందరు సంక్రమించిన ఆస్తిలో కొంత ఊరికే ఉండిపోడం ఎందుకని, కొందరు సాటివాళ్లు ఇస్తూంటే తమురు తీసి పోవడేం అనీ, లాంటి అనేక కారణాల వల్ల యజమానులు కొంపలు అద్దెకిస్తూంటారు. ఒకడు తనవర్ణం వాడికి గాని ఇవ్వడు. ఒకడు తనశాఖవాడికే ఇస్తాడు. ఒకడు బ్రహ్మచారికిగాని ఇవ్వడు. ఒక్కొక్కడు డిస్ట్రిక్టు మునసబులకే ఇస్తాడు (సరిహద్దు గోడ కేసులు, స్వంతానివి, చాలా వుండి). ఒకొక్కడు పోలీసు వారికిగాని ఇవ్వడు (తను ప్రతీవాడి మీద ఎగరచ్చునని, మహా!) ఒకొక్కడు గృహస్థునికిగాని ఇవ్వడు. సాధారణంగా ఎవరుకూడా తమ బంధువులకి యివ్వరు (సంసారపు గుట్లు బయట పడతాయనీ, భోజనానికి దానికీ పిలుస్తూండాలనీ, మొత్తంమీద కొంత ఎంగ ఎందుకే నామంచిదని) ఏమైనా సరేగాని, అద్దె కొచ్చేవాడు తేగలపాతర సంతానం వాడయితే, ఎంతశాంతుడైన యజమానికైనా సరే అరికాలిమంట నెత్తికెక్కుతుంది. (కొంప నిమిట్లమీద ధ్వంస ధూళి చేస్తారని) అందుచేత, ఏకపుత్రుడో లేక దత్తుడో అయిన పెళ్లి కుమారుణ్ణిచూస్తే కన్యాదాతకి పథ్యమైనట్టు, అన్నహితవులేని నెలభోక్తనిచూస్తే హోటలు మేనేజరుకి ప్రాణమైనట్టు, సోడిఎరగని తడిగల ఇస్తోకు సంసారం అద్దెకొస్తున్నారంటే. ఇంటివారు ఎగిరిగంతేస్తారు. అందులో ఆ అద్దెకువచ్చేవాడు ఇరుపార్శ్వాలనా అన్నవాడు లేని వాడయితే ఇంటివారికి మరీయిష్టం. ఒకవేళ ఉన్నా, మాటలుగాని, చూపులుగాని, భోయినాలుగాని, మూడూగాని లేనివారయినా చాలు.

అవసరం కలగగానే, తలదాచుకునేటందుకు స్థలం దొరికితేచాలని, జనం ఘోటుఘోటు మంటూ కొంపల కోసం తిరుగుతారు. "అద్దెకివ్వబడును" అని కట్టిఉన్నవీ లేనివీకూడా తణిఖీచేస్తారు. వాటి యజమానుల్ని పట్టుగుంటారు. వ్యవహారం చొప్పున యజమానులు తమ అద్దె భాగంయొక్క శ్రేష్ఠతా, సౌకర్యమూ, హంగూ వగైరాలగురించి ఒక గంభీరోపన్యాసం ఇచ్చి, లోగడ అది ఖాళీచేసినవాడియొక్క చెడ్డతనం, లోట్లు, పిసినిగొట్టుతనం, పేచీకోరు స్వభావంగురించి— (ఏవరెల్లాంటివారైతే మనకేంగాని అంటూనే) విస్తారంమున్నటించి, ప్రస్తుతం అద్దెకొచ్చినవారితో ఏదో బాదరాయణసంబంధం అతుకు సమర్థించి, తమయొక్క స్వార్థత్యాగమూ, జనాన్ని గూర్చి తాముపడుతూన్నపాట్లూ, అద్దెలకివ్వడంవల్ల తమకుండే నష్టాలూ వాటిని, తాము లెఖచెయ్యకపోనీ ఎవరో పరాయివాళ్లు సుఖిస్తారుగదా అదే తమరూ కోరేదని, తాము ఈవ్యాపారంలోకిదిగడమూగురించి కొన్నిడబ్బాలు కోసి, అద్దెకొచ్చినవాణ్ణి గభరాయింపజేస్తారు. దాంతోటి ఆవచ్చినవాడు, కడుపునిండి— ముస్తాబుచేసిన అవకరపుపిల్లయొక్క పై మెరుగుచూసి తాంబూలాలు పుచ్చుకున్నట్టు— అడ్వాన్సుపారేసి చేరేస్తాడు; కాని, కాపరం

చేసిచూసిన మీదటగాని కమామీషుపూర్తిగా తేల్తాండదు. కొన్నాళ్లు నిదానించేసరికి ఒకొక్క అద్దెకొంప యొక్క ప్రత్యేకపు చిక్కులు అద్దెకున్నవారికి నాటి, జీర్ణించి, శల్యగతం అవుతాయి.

అజిలగాయతు అద్దెకున్న వాళ్లల్లో సణుగుడు బయల్దేరుతుంది. సాటివాళ్లంతా చేరి చిక్కులువెళ్ల బోసుకుంటుంటారు. "మాభాగం దివ్యంగానే ఉంటుందికాని, వీధికి ఫర్లాంగుదూరం దీంతగలెయ్యా! ఛస్తే కేక అందదు. రాత్రెళ్లప్పుడుచావే" అని ఒకరు. "మాభాగం చందుగా పెట్టెలాగ కుదిమట్టంగా ఉంటుందికాని, ఒక్కటొచ్చింది: స్త్రీలకి ఇబ్బంది వచ్చినప్పుడు మాచెడ్డ ఇబ్బంది. వీధులోంచి చుట్టుతిరిగి దొడ్లోకి వెళ్లాలి." అని ఒకసంసారి. "మాకు దొంగభయం దొ్రటభయంలేవుగాని, ఖర్చుపడ్డ జవాబా యావత్తూ మాగుమ్మంలోంచే నడవడం" అని ఒక ఓఘాయిత్యుడు. "మాకొంపకి మట్టుకిరోగంటగాని, వానాకాలంమాత్రం నరకం. కాస్తసంయుక్తాగ్రగుడం కూడా ఉండదు రోడ్డుమీంచి కొంపలోపడడానికి" అని ఒక నారాయణరావు. "మా ఇల్లు మహా ఎక్కా ఇల్లు! కానయితేం, దొడ్డి బహుకుశలం. ఒకొక్కరే వెళ్లాలి, రావాలి!" అని ఒక కుసుమయ్య. "మా ఇల్లు మాత్రం తీసిపోయిందిటగాని, ఒక్కటే లోటు! గాలిరాదు. రాకపోతే పీడాపోయిరి. ఇదివరకే ఉందేమో అంటే దీపం ఆర్పడానికికూడా లేదు." అని ఒక ఆంజనేయులు. "మావాటా పెద్దదే అనడం, కాని, అనేక మాట్లనించి చూస్తాము, పురుళ్లకి ఇంతా అంతా కాదుకద చిక్కు!" అని ఒక బ్రహ్మయ్య. "మా ఇల్లు ఫస్టు. కాని కొంపకి చుట్టంవచ్చేసరికి ఇంటాయన పెళ్లానికిమంట. స్నానానికి వెళ్ళి మాతివగ్గరచేదిడు నీళ్లుపోసుకుని రెండోచేద తీసే సరికి యజమానివచ్చి చేద అటకాయిస్తాడు— నీళ్ల [illegible] కిస్తే ఫన్ను అంటుగుంటుందట" అని ఒక [illegible]. "మునిసిపాలిటీపన్ను హెచ్చినప్పుడుకూడా మా ఇంటి అద్దె హెచ్చుతూనే ఉంటుంది" అని ఒక [illegible]. కొంపలు ఇతరులవిగనక ఇలాగంటి లోట్లు [illegible] చెప్పుకుంటూ, ఆ అద్దెకే అంతకంటె మంచి [illegible]తే లేచిపోదామని వీరూ, ఆకొంపమీదే (దమ్మిడీ మరమ్మత్తైనా లేకుండా, ఉన్నవారిని పొమ్మని, వచ్చేకొత్తవారిదగ్గర) మరినాలుగు రూపాయలు లాగాలని యజమానులూ తీవ్రయత్నాలుచేస్తూనే ఉంటారు. కర్మవాదన ధర్మమా అని ఉన్నస్థితికే సరిపుచ్చుగుని దేవుళ్లాడుతూంటారు.

అద్దెలకి ఉండేవారిని నాలుగుభాగాలు చెయ్యొచ్చు. అనగా అల్పాలు మినహాయించగా, వీరు నాలుగు రకాల కిందికి వస్తారు. మొదటిరకం: ఇంటివారు పరోక్షముందుంటగా, యావత్తుకొంపలోనూ ఉండే ఏకకుటుంబం. వీరిది స్వరాజ్యం. వీరి అరచెయ్యిదుర్భిణీకింద పెడితే, లేఖలు గోచరించి తీరతాయి. కొద్ది మరమ్మతు వగైరా చేయించడానికి ఇంటివారు రావడానికి వీల్లేక అద్దెకింద చెల్లురాసి వీరే ఇంటిబాగు చూసుగుంటారు. గృహం పరులదే అయినా పెద్దమరమ్మతు అగత్యమో, అద్దెలో పెంపకమో వచ్చేసరకూ వైదీకానికి గూడా వీరు "స్వగృహే" అనేటట్టు ఉంటారు.

రెండోరకం: ఇంటివారు పరోక్షముందుండా, మధ్య ఉమ్మడి హాలుగల రెండు సమాన వాటాలలో ఉంటూండే రెండు వేరు సంసారాల వాళ్లు. చేరిన కొన్నాళ్లు వీరు క్షీరనీర న్యాయ్యంగా ఉంటారు. వారిలో ఒకవాటా ఆవిడ గడుసుదీ రెండోవాటా ఆవిడ మెత్తనిదీగనక అయినా, మొదటి ఆవిడ రెండో ఆవిణ్ణి కీలుబొమ్మనిజేసి, ఆడించి, దానిచేత చాకిరీ చేయించుగుని, దాని యిల్లు ఓకడకి తెస్తుంది, ఇది అరుదు. సాధారణంగా జరిగేరీతివేరు. ఓవాటాలో జనంతక్కువ ఉంటారు. ఆఅద్దెకే, సమానవాటా అయిన రెండోదాల్లో ఎక్కువ ఉంటారు. ఎక్కువవారు తక్కువవార్ని తోసుగొస్తారు. అల్లాంటప్పుడే యుద్ధాలుజరగడం. ఎటొచ్చీ, కొన్ని చిన్నవి, కొన్ని పెద్దవి. ఉమ్మడిస్థలం ఇద్దరూ వాడుకుంటారుగాని ఎవరూ తుడవరు. ఒకవేళతుడిస్తే, ఇద్దర్లోనూ లౌక్యం ఎవరుఎరుగర్లో వాళ్లు తుడుస్తారు. ఉమ్మడిహాలు తమరొక్కరే వాడుకోవాలని ఇద్దరూ ప్లానువేస్తుంటారు. ఓరింటికి బంధువులువస్తే, వారు ఆబంధువులికి ఉమ్మడిహాల్లోనే విడిది యిస్తారు. రెం

డోవాటావాడు, ఉమ్మడిహాలుమీద తనహక్కు నాశనం అయిపోతుందని పెళ్లాంతో కూడ బలుక్కుని, తన యితరపనులు మానుకుని తనుకూడా ఓచాప తనపక్క వేసుకుని పెద్దప నున్నట్లు ఏదో రికార్డు ముందేసుకుని సృష్టిలో లేనికాగితం వెతుకుతూంటాడు. ఓవాటాదారు ఉమ్మడిహాలులో ఏతిరగలో రోలో పెట్టుకుంటే, రెండోవాడు ఏ నులకమంచమో, పిడకలతట్టో అరువేనా తెచ్చి పెట్టించి మరోపని చూసుకుంటాడు. కొంతకాలం జరిగిం తరవాత ఓకింటో ఏ తద్దినమో అయినప్పుడు, రెండోవాటా ఆయన అచ్చాడీలవంటి మ్లేచ్ఛుల్ని తీసుకొచ్చి సిగరెట్టుపొగతో ఘుమఘుమ లాడుతూ ఉమ్మడి హాలులో ప్రసంగిస్తూంటాడు. రాత్రిళ్లు వీరివేపున వారూ, వారివేపున వీరూ లఘు, గురు, మరి ఇతరమైన శంకలు తీర్చుకుంటూండడం, ఉదయాన్నే లేచీ ఆకాశ రామన్న మీదపెట్టి ఒకర్ని ఒకరు అక్షులూ పక్షులూ గాల తిట్టుగోడం. స్వతస్సిద్ధంగా చేతులో వుండే వాయువు జర్నో, లేక మనస్సులో ఉండే ఇతర తెగులో కాని, శీలునుబట్టి పుల్లిస్తరాకులు అవశల వాటాస్థలంలో వెయ్యాలనే ప్రతీవాళ్లూ చూడడం. ఒకచోట, రాత్రి ఎనిమిదిగంటలవేళ, ఒకవాటా ఆయన, "లంకాదహనం" చేస్తూ అరుగుమీద కూర్చుని ఉండగానే రెండోవాటా ఆవిడవచ్చి, ఊరంత పుల్లిస్తరాకుల మోపుతెచ్చి మొదటి వాటాకి ఎదురుగుండా దబ్బున గిరవ పెట్టగా,

ఆయన—చెట్టంతమనిషిని ఇక్కడ ఉంటూం డగానే ఏమిటమ్మా ఆపనీ?

ఆవిడ—ఏంలేదండీ! మాయింటో భోయినాలు అయినాయి, పుల్లిస్తరాకులు.

ఆయన—ఆమాట నాకూ తెలుసు, మావేపునేనా మీరు వెయ్యవలసింది?

ఆవిడ—ఏంజెయ్యమన్నారు?

ఆయన—సిగ్గులేదుటమ్మా! మీవేపున వేసుగోలేరూ?

ఆవిడ—మాకు మైలగనా మరీ, మావేపు నెల్లా వేసుగోడం, మైలవిస్తళ్లు?

ఆయన—ఆహో టా! ఎంత శౌచమమ్మా! అనేసరికి ఆవిడ గొల్లున రాగాలెత్తి, (ఇది, స్త్రీయొక్క ద్వితీయాస్త్రంగా ముకీ!) రెండోవాటా కట్టిచ్చాడు, ఆడవాళ్ల వ్యాపారలలోకి జోరబడి, తనఘోషా చెడగొట్టి, తనని అనవచ్చినమాటా అనరానిమాటా అని నానాగోలా చేశాడని మునుసుగారికి రిపోర్టుచేసేసరికి, వాడు భేతాళుడల్లావచ్చి "మావాళ్లతో ఏమిటా ప్రేలాప్, మావి స్తళ్లగోల నీకెందుకురా? ఫుంఖాకోర్? మాధుష్ నీఉద్యోగం లాగించేస్తాను" అని ఆయనమీద కలియబడగా మేజస్త్రీటంత పనిజరిగి, జనంవచ్చి వారిని విడదీసే సరికి కోడికూసింది.—

మూడోరకం! ఈరకంకూడా యజమానులు పరోక్షముందు ఉండేదే. అయితే దీంట్లో మూడు చిల్లరరకాలున్నాయి. ప్రథమం! నానా సంసారాలవాళ్లు గూడు పుఠాణీలా ఉండే ఒక అద్దెకొంపల సత్రంలోనో, లేక పోలీసు లయినులా ఉండే అద్దెకొంపల మాలలోనో ఉండేవారు. వీటికిదొడ్డి, పాకీదొడ్డి, నుయ్యిలాంటివి ఉమ్మడి. దొడ్డికి మరుగుఉండక స్త్రీలు బాధపడతారు. పాకీదొడ్డిదగ్గిర ఉదయం అయినులగాయతు సుమారు ఏడు వరకూ నూరుగజాలపోటీ పందెంలాంటివి జరుగుతూండడంవల్ల రద్దీ ఎక్కువ. నాతిప్రాంతాలకి పగటిభాగంలో మొగాళ్లు వెళ్లలేరు. ద్వితీయం! పైనచెప్పినలాంటి వాటిల్లోనే బ్రహ్మచారులు (తరుణ విద్యార్థులు) గాని, తాత్కాలిక బ్రహ్మచారులుగాని ఉండడం. ఇందులో ధూమస్తంభ నిర్మాణం జరుగుతూంటుంది. "టీ" పానం ఉంటుంది. కిల్లీ ఉమ్ముల అసహ్యం కనిపిస్తుంది. నాజూకు చేతిగోలుసులు, సిల్కుకండువాలు, మనీపర్సులులాంటివి స్వతహా జడపదార్థాలైనా, ఎగిరిపోతూంటాయి. కొత్తరిష్టువాచీలు తప్పకుండా తిరుగుతూంటాయి గనక, నడుస్తూంటాయి. తృతీయం! పైనిచెప్పినలాంటి వాటిల్లోనే కొన్ని వాటాల్లో సంసారులూ, కొన్నింటిల్లో తాత్కాలిక బ్రహ్మచారులూ కలగలుపుగా ఉండేవి. వీటిలో, చెప్పేదేముంది? జాబులూ, నిట్టూర్పులూ, రేపులమాపులూ, మాపులరేపులూ లాంటివి ఉంటాయి.

పెరడు ఇక్కడ సాలుగోరకం! దీల్లో, ఇంటివారు ఒక వాటాలో ఉండగా, వారి దివ్యసమక్షమందు, తక్కిన వాటాల్లో అద్దెకొచ్చిన వాళ్ళుంటారు. ఇల్లా ఉండడం అద్దెకివెళ్ళేవాడి సాహసానికి పరమావధి. అద్దెకివెళ్ళేవాడికి ఇది కత్తిమీదసాము, పులితోచెలగాట. ఇంటివారి ఉద్దేశం తమరు పాలకులమనీ, ఇవతలవాళ్లు పాలితులనీ; తమరి హృదయం విశాలమనీ, ఇవతలవారిది ఇరకాటం అనీ; తమరి అంతస్సుకి కొన్ని వందల మెట్లు క్రిందిలోకంలో అద్దెలిచ్చేవాళ్లు ఉండాలని. ఇంకాకొందరి అద్దె యజమానుల ఊహ ఏమిటంటే, అద్దెలవాళ్ల యొక్క రాకపోకల్లు, రీతులు, ఖర్చులువగైరా అంతాకూడా తమ ఇష్టానుసారం ఉండాలని. ఈఅభిప్రాయం ఆయనదే కాదు. ఆయన కుటుంబానిది. కాబట్టి, ఆయనకి ఆయన తల్లిదండ్రులకి, పుత్రీపుత్రులకి, పౌత్రదౌహిత్రులకి, లేకపోతే వీరి ఆదరణ పొందిన వారికీ — ఇంతమందికీకూడా అద్దెలవాళ్లని ఆంక్షలు పెట్టడానికి జన్మహక్కు ఉంది. కాని, వీళ్లనేంచేస్తారూ! వీరంతా ఓవైపైత్తూ, అద్దె యజమానులు గారు ఒక్కత్తీ ఒకయెత్తూ! ఒకొక్క యజమానురాలి చర్య అద్భుతం! అసల్కిఆవిడ గృహిణి. అందులో అద్దెకొంపల రాణి, అందులో కాస్తస్వాతిశయం కూడా ఉండే ఆవిడ అద్దెకొచ్చిన వాళ్లని ఎల్లామూ స్వంచరిత్రను ఊహాతీతప్పుచేసినకోడల్ని అత్తగారు ఇంతగా కొరాయించదు! నీతితప్పిన పెళ్లాన్ని తాళి గట్టిన మగుడు ఇంతగా దండించడు! నేరంచేసిన పాపిని దండనాధికారి ఇంతగా దుయ్యబట్టడు! చవట పరిపాలన చేసే మంత్రి శేఖరుణ్ణి సామ్రాజ్య మంత్రి ఇంతగా బెదరగొట్టడు! అద్దెల వాళ్ల ఆచారం, గర్వం, తన వాటాం మరి. తన వస్తువు ఇంకోరి ఇంట్లో కనబడితే, వారిది దొంగతనం; ఇంకోరి వస్తువు తనింటో ఉంటే, "అక్కడికి పోతూం! పొరపాటు!" అనడం. అద్దెల వాళ్ల వాటాల్లోంచి ప్రవహించేది అపవిత్రమైన కంపుగల నీరు, తనవాటాలోంచి వెళ్లేది పావనమైన గంగ (ఇదంతాకలిసి ఒకచోటేగా... అయినా వారివి పావన అంతే) దొడ్లో తక్కినవాళ్ల వాటా కనిపేన్నీ కేవలం తనవే. నలుగురూవచ్చే నూతి దగ్గిర తమరితాలూకు పిల్లగుడ్డలు మాత్రమే జాడించవచ్చు! అద్దెలవాళ్లు గనక ఆపనే అక్కడ చేస్తే, "ఎవళ్లకొచ్చింది ఈవినాశకాలం! అన్నం తింటారా, గడ్డి తింటారా!" అంటూ తను ఆపనిచేస్తూనే, ధరీ అంచూ లేకుండా లెక్చరు పూర్వకంగా తిట్టడం. ఇవతలవాళ్లు ఏమైనా సమాధానం చెప్పబోతే, "ఉంటే ఉండు, సాయంత్ర వేళకి నాకొంప ఖాళీచెయ్! మరే! నన్నాట్టే వాగించకు! నానాలిక మంచిదికాదూ!" అని తారస్థాయిలో అరవడం. ఇన్ని హారతులూ అయింతరవాత తనకి అవసరం వచ్చేసరికి, పూర్వ చరిత్ర యావన్మందీ మరిచిపోయినట్టు, లేని నవ్వు తెప్పించుకుంటూ రావడం. (ఓగంట తిరక్కుండానే) తన పని ముందు అయ్యేటట్టు చూసుకోడం. ఒకవేళ తమరింటో వంటకాకపోయినప్పుడు, తనతాలూకు ఏమనమడికో అద్దెవాటా వాళ్లింటో అన్నంపెట్టించి, చెయ్యికడిగేసరికి వాడు "అమ్మమ్మా, జియ్యా" అనో "అమ్మమ్మా, యాక్కు" అనో అంటాడనుకోండి మాట వరసకి. ఆపళంగా ఆవిడ పళ్లుకొరికి పెదిమి కరుచుకుని వాణ్ణి మొట్టి చంపేసేంత అభినయంచేసి, రెక్కట్టుకుని బరబరా ఈడ్చుకుపోతూ, "వెధవ ఏడుపూ నువ్వూను, కాస్సేపు నిమ్మళించుకోకుండాను!" అంటూ తిట్టి అన్నంపెట్టించిన వాటా వారి కిటికీకి ఎదురుగుండానే వాణ్ణి కూచోపెడుతుంది. నాలుగైదు సార్లు ఈవైఖరి భరించి, తరవాత సారి, ఆవాటా ఆయన "అమ్మా! ఇదేమండీ! మీ వాటా లేదా? పోనీ దొడ్డిలేదా?" అంటే ఆవిడ "నువ్వు చెప్పనవసరం లేదు. కుర్రనాగమ్మకి భయం చొప్పున దొడ్లోకి వెళ్లలేడు. అదీగాక, మావాడికి మావాటాలో కూచుంటే విరోచనం సరిగా కాదు! నువ్వెరగవ! నీపని నువ్వు చూసుకుందూ! అదీగాక బోలెడు కుక్కలున్నాయి, మనుష్యులు తిరుగుతూంటారు, ములిగిపోలేదు పోదూ!" అని ఆయన మీద సబబులు కురిపించింది. ఇంకోరి సంగతి వచ్చేసరికి ఈప్రమేయమే ఆవిడకి జ్ఞాపకం ఉండదు. ముఖ్యంగా, అద్దె యజమానురాలి అభిమాన విద్య ఏదీ అంటే దాసీజన పరిపాలన. ఆవిడకి దాసీలు చెలికత్తెలు లాంటివారు. తను ఏదాసీదాన్ని నియమి

స్తుంది. అదే అద్దె కాపురాల వాళ్లందరికీ దాసీగా ఉండాలని ఆవిడ ఆజ్ఞ. ఒకవేళ తనూ అదీ పేచీపడి, కట్లపాముల్లాగ లుంగలుచుట్టుగుని వీధినిబడి తిట్టుగుంటేటప్పుడు (ఈముచ్చట వారానికి రెండుసార్లేనా అవుతుంది.) అద్దెకాపురాల వాళ్లంతా ఏకమై ఆదాసీదాంతో వైరంకట్టాలి. మొదట్లో ఏదాసీదైతేమని అంతాఒకదాన్నే పెట్టుగుంటారు. కానీ, ఇంతమందికీ ఒక్కత్తే దాసీది అవడంవల్ల ఒకరిపనిముందూ (అంటే ఇంటివారిపని) ఒకరిపని వెనకాలయి, అసహ్యాలుపుట్టి తిట్టుగోడాలు జరిగి, కొందరు కాపురాలవాళ్లు, దాన్ని మానిపించేసి, (చాకిరీ స్వయంగా చేసుకోగలిగినా దర్జా పడిపోతుందని భయమేసి) కొత్తదాన్ని పెట్టుగుంటారు. అక్కణ్ణించి, ఇంటావిడ, కొత్తదాసీని ఎల్లాగేనా ఖజ్జాలోకి లాగమని పాతదాన్ని గిల్లడంలోనూ, ఎవ్వరూ ఇసుక్క కలపకుండానే ఏదోతరుణం చూసుగుని తనే వెళ్లి విరుచుగుని కొత్తదానిమీదపడి కరవడంలోనూ మునిగిపోతుంది. ఒకానొకచోట ఇల్లాంటి విషయంలోనే హిడింబాయమ్మగారు అనే ఒక అద్దెయజమానురాలు కొంతగ్రంథం జరిపింది. హిడింబాయమ్మ లోగడ కాశీవెళ్లినప్పుడు అక్కడ సిగ్గు భిడియాలూ అడ్డబాసా కట్టగట్టి గంగలో విడిచిపెట్టింది—ఏదో విడిచిపెట్టాలి గదా అని. దాంతోటి, ఆవిడ ఇంటికొచ్చేసరికి, అదివరకు గంటకి యాభైమైళ్లచొప్పున ఉండే ఆవిడ వాగ్వేగం రెట్టింపైంది. ఆవిడ గాత్రమాధుర్యం గురించి మాత్రం ఎవరూ "గారంటీ" గా చెప్పలేరు. వారితాలూకు వాటాలో ఉన్న, మాచిరకాల స్నేహితుడైన కేశవరావుగారి కొత్తదాసీని పదిరోజులపాటు హిడింబాయమ్మ గదిమి, అదరకాయించడం కేశవరావుగారు తన ఇంట్లోంచే విని, పదకొండోనాడు వ్యాపారం ముదిరినట్టు కనబడి, తను దొడ్లోకివెళ్లి సంగతి కనుక్కోడానికి యత్నించాడట. అప్పుడు వారికి ఈసంభాషణ జరిగిందట.

కే—అమ్మ! ఏమిటండి, ఆకేకలు?

హి—ఇక్కడ శ్రీమేల్సు ఉన్నారని చెప్పవేమే, దాసీముండ!

దా—ముండలు మాలో ఉండరమ్మ! నువ్వే సెప్పు!

కే—అమ్మా! నాకు బోధపడింది. తమరు పెద్దలు! తమరు ఎక్కడా ఎప్పుడూ నోరు మెదపనట్టు అల్లా సెలవిస్తారేం?

హి—(చేతులూ తలాతిప్పుగుంటూ, ఆడిపోతూ) రైంయిన్యమంటూ వొచ్చావుగాని ఆడవాళ్లమీదికి, నడు నడు! ముక్కుముక్కలవుతోందే అమ్మా! అని దాసీ దాన్ని మురుక్కాలవ కాస్తతుడవ్వే అని అనుగుతూంటేనూ, "ఏమిటే, ఏమిటే, ఏమిటే" అంటూ అడొచ్చాడు పెద్దమనిషి! ఇంతేనా బియ్యే! సంతోషించాంలే నీతెలివికి!

కే—(అక్కడే కూర్చుని ఉన్న ఆవిడ భర్తగారితో) భీమారావుగారూ! వింటున్నారా? ఈఅంతఃపురస్త్రీయొక్క మాటమార్దవం?

భీ—చిత్తం! వింటున్నానండి!

కే—అమ్మా? మాదాసీది మీమురుక్కాలవ ఎందుకు తుడవాలీ?

హి—ఎందుకా, మండుకు! మీవంటింటోంచి కంపు వస్తోంది గనక!

కే. మావంటింటోంచి తూము నూతిపళ్లెంమీదికి ఉంది. నూతిదగ్గిర, ఈతూమువేపు కంపులేదని ఇక్కడికి సెకనుకి పదిమంది చొప్పున వచ్చేజనం అందరికీ తెలుసు. అక్కణ్ణించి నీళ్లదారి మీస్నానాలగది అంటారేం, అందులోకి ఉంది. దాని తరవాత నించి మురుక్కాలవ ఉండనూ ఉంది. నాముక్కూ బద్దలవుతూనే ఉంది. కాబట్టి ముక్కుపేలేపనులు మీస్నానాలగదిలో జరుగుతూండాలి. అందుకని, మీకు శక్యం అయితే మీదాసీదానిచేత తుడిపించుగోండి. డబ్బునే ఇస్తాను. కామూ కూడమూ తుడవడమే మాపూచీ అంటారా, ఆకంపునీళ్లు తుడవడానికి డబ్బిచ్చినా ఏదాసీదీ రాకపోతే, ఎక్కణ్ణించి ఎక్కడికి మేంతుడవాలోచెప్పండి, నేనేస్వయంగా చీపురుకట్ట పుచ్చుగుంటాను, మీ ఇంటో ఉన్నందుకు!

హి_కాక మరేమిటి! చీపురుకట్ట ఉద్యోగమే నీకు రాసింది. తుడుతుడు! దాసీ దాన్ని మానిపించి డబ్బుమాట కట్టుకో! అంతా తుడు!

కే_భీమారావుగారూ! తప్పెవరిదో గ్రహించండి!

భీ_గ్రహించానండి. నాది.

కే_అదేంకర్మం? మీతప్పేమిటి?

భీ_తప్పులు బాబూ, తప్పుకాదు! మొదట, పెళ్లి చేసుగోడం. రెండు, కొంప అద్దెకి ఇవ్వడం!

కే_అల్లా వాదిస్తే ఈప్రపంచమే తప్పు! అతి వేదాంతంలోకి దిగకండి మరి! మేం జీతమిచ్చేదాసీది మేంచెబితే వినాలి. వింటుంది..మాడబ్బుతో మాదాసీని కుదుర్చుకునే స్వతంత్రత మాకులేదూ? ఇక ఇండియాకి ఇంగ్లీషువారు స్వాతంత్ర్యం ఇస్తారా? అడగచ్చా?

భీ_ఇస్తారేమోకాని, మా ఆవిడ ఇవ్వనిమాట రూఢి.

కేశవరావుగారు సున్నితపు మనిషి. ఆపళంగా, ఆయన, తను అన్నప్రకారం చీపురుకట్టపుచ్చుగుని నూతి పళ్లెం చివరదాకా నాలుగురోజులుతుడిచాడట. ఎవరూ చూడనప్పుడు నూతిపళ్లెం పాడిచేసిరమ్మని, హిడింబాయమ్మ తన చిన్నసంతానానికి "కీ"యిచ్చి ఆ నాలుగు రోజులూకుడా కసిగానే ఉందిట. తరవాత, ఈసంగతి నలుగురికీ తెలిసి, కలవరంపుట్టినమీదట, యజమానిగారు చాలా నొచ్చుగున్న పిదప, ఆవిడకూడా కొన్ని మెట్లు దిగి కేశవరావుగార్ని బతిమాలుకున్నమీదట ఆయన ఆ ఉద్యోగం మానేశాడట. అప్పణ్ణించీ హిడింబాయమ్మ ఆయనతో మాట్లాడుతోచ్చినా, ఆయన అవిణ్ణినిరిషించుగోడట. అందుచే, అప్పుడప్పుడు, కొడుకుమీద పెట్టి నేటివరకూ తిడుతూనే ఉంటుందిట. భీమారావుగారి మంచితనంచూచి కేశవరావుగారు అక్కడే ఉన్నాడు. ఇది నాలుగోరకం. ఇది అధమాధమం. ఇంకా, వీథివేపు అద్దెకొట్లూ, ఉద్యోగి జీతంలో పదోవంతు అద్దెఉండే గవర్నమెంటు తాలూకు అద్దెభవనాలూ, బజార్లో హెచ్చు అద్దెలుండే కొట్లూ, ఊరుబయటిశ్మశానాల దగ్గిర తక్కువ అద్దెలకి దొరికే కొంపలూ, కొంపకి అద్దెకి పుచ్చుగున్నవాడు దాన్లో కొంత మళ్లీ తక్కువ అద్దెలకిచ్చిన భాగాలూ (నాటకంలో నాటకంలాగ!) వగైరా అనంతంగా ఇతర రకాలు ఉన్నాయి.

కొంపలు ఎందుకు ఖాళీ చేస్తూంటారో కుడా చిత్రమే. కొందరు చాలక, కొందరు చిక్కులు అల్లాగే ఉండడాన్నించి, కొందరు ఇరుగు పొరుగు సరిగా లేక, కొందరు అంత అద్దెయిచ్చుగోలేక, కొందరు కొత్త ఇల్లు కట్టుగుని, కొందరు పాతయిల్లు కొనుక్కుని బాగుచేయించడానికి కొత్తయిల్లు కట్టేకంటె ఎక్కువ పెట్టుబడిపెట్టి, కొందరు విసిగెత్తిపోయి, కొందరు దెయ్యాలున్నాయని గ్రహించి, కొందరు పాములు కనపడి, వంటింట్లో మొండి చెయ్యి మొలవడంవల్ల కొందరు, ఇంటిసరంబీకి తేనె పట్టుపట్టి కొందరు, కొంపమీద గద్దవాలి కొందరు, ఇంటిమీద బ్రహ్మచెముడు పాకడంచేత కొందరు, దొడ్లో అరిటి చెట్టు దక్షిణానికి గెలవెయ్యడంచేత కొందరు, కొందరు తమ కొంపకి వాస్తుప్రకారం నుయ్యో, ద్వారబంధమో తబ్దీలుగా పడడం మూలాన్ని, కొందరు అచ్చిరాక, సరి, కొందరు మారితేచాలని.

అద్దెలధోరణినిబట్టి చూస్తే భౌతికలోకం యొక్క అస్థిరత్వం స్ఫురణకొస్తుంది. కొంపలేకాదు. ఊళ్లూ, జిల్లాలూ, ఈఇండియా, ఈప్రపంచం ఇవన్నీ కూడా అద్దెవ్యాపారాలే కదా అనిపిస్తుంది. రోగం వల్లో, బెడదచేతో, అవాంతరం మూలానో, కూనీ ద్వారానో, ఆత్మహత్యరూపంగానో, దారిద్ర్యం ధర్మమా అనో ఏదో తరవాతతరవాతమాత్రమే మానవులకి గోచరించే కారణాన్ని పురస్కరించుకుని జీవుడు శరీరం ఖాళీచేసి పోతూండడం అరగారగా చూడగా ఎవడిమట్టుకి వాడికే తెలిసేదాన్ని బట్టి—జీవుడికి శరీరాలు అద్దెకొంపలు.